క్లుప్తంగా

నూతన కలెక్టర్‌కు శుభాకాంక్షలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్

ఖమ్మంరూరల్: జిల్లా కలెక్టర్‌గా బదిలీపై ఖమ్మం వస్తున్న నూతన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ఏదులాపురం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, రూరల్ తహసీల్దార్ పి.రాం ప్రసాద్‌లు శుక్రవారం తరుణీహాట్ వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న నరసింహారెడ్డి

కామేపల్లి: మండల పరిధి జగన్నాథ్‌తండా, రేపల్లెవాడ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి శంకుస్థాపన చేశారు. పేదవారి సొంతింటి కల కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, నాయకులు రామిరెడ్డి జగన్నాథరెడ్డి, దమ్మాలపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'భూ భారతి'కి విశేష స్పందన

కామేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి విశేష స్పందర లభిస్తుంది. శుక్రవారం ఈమేరకు మండలంలో ముచ్చర్లలో 270, మలిపురిలో 145 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు గింజల నరసింహారెడ్డి, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, దమ్మాలపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమం

నేలకొండపల్లి: దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో ఉద్యమాలు చేపట్టనున్నట్లు టీడీ జేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్‌ను ప్రకారం ఉపకరణాలు అందించడం లేదని మండిపడ్డారు. ఉపకరణాల కోసం వివిధ రకాల సర్టిఫికెట్లు అడుగుతున్నారని, అలా కాకుండా ప్రభుత్వమే జీఓ 89లో కొన్ని మార్పులు చేసి అందించేలా చూడాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. టీడీ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలలో అపరిశుభ్రతపై విచారణ

నేలకొండపల్లి: మండలంలోని రాయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెలకొన్న అపరిశుభ్రతపై ఎంఈఓ బి.చలపతిరావు శుక్రవారం విచారణ చేపట్టారు. తొలిరోజు పాఠశాలకు వెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రులు అపరిశుభ్రతపై మండిపడిన ఘటనపై ఆయన పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులను వివరణ అడగ్గా.. పొంతనలేని సమాధానాలు చెప్పినట్లు సమాచారం. ఆతర్వాత అపరిశుభ్రతపై యుద్ధ ప్రాతిపదికన పనులు చేయించారు. కాగా, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని సొసైటీ డైరెక్టర్ తీగ రమణయ్య పేర్కొన్నారు.

మారిన విద్యుత్‌సబ్ స్టేషన్ల ఫోన్ నంబర్లు

తిరుమలాయపాలెం: మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్లకు కొత్తగా ఫోన్ నంబర్లు కేటాయించారు. వాటిలో హైదర్‌సాయిపేట విద్యుత్ సబ్ స్టేషన్‌కు 87124 83692, పాతర్లపాడుకు 87124 83693, పిండిప్రోలు 87124 83694, తిప్పారెడ్డిగూడెం 87124 83695, తిరుమలాయపాలెం 87124 83696 నంబర్లు ఇవ్వగా, వినియోగదారులు వినియోగించుకోవాలని ఆ శాఖ అధికారులు సూచించారు.

చెక్కుల పంపిణీ

ఖమ్మంవన్‌టౌన్: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు కార్పొరేషన్ పరిధిలోని 51, 52, 58 డివిజన్లలో శుక్రవారం లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు శెట్టి రంగారావు, తోటకూర శివయ్యలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. పువ్వాడ వరలక్ష్మి, మహ్మద్ ఆదిల్ పాషా, చింతమల్ల సుమ, వద్దినేని రవీందర్, పోలబోయిన సత్యవతి, లింగం రమాదేవిలకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, ఆశయ్య, కరుణ, బేబీ, నాంపల్లి శంకరయ్య , బోడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మండలంలోని ఓ గ్రామంలో వ్యవసాయ భూమి

పల్లెకు పరపతి..

గ్రామీణ పంట భూములకు గిరాకీ

- పట్టణాల్లో ప్లాట్లు కాదని కొనుగోలు చేస్తున్న పలువురు
- ఫలితంగా పలు ప్రాంతాలకు మహర్దశ
- వ్యవసాయ భూమైతే మేలని భావన
- నానాటికీ పెరిగిపోతున్న ధరలు

పల్లెకు పరపతి పెరిగింది. పట్టణాల్లోని ప్లాట్లు కాదని పల్లెల్లోని పంట భూములను కొనేందుకు పలువురు ఆసక్తి కనబరుస్తుండడంతో మహర్దశ పట్టింది. 'పట్టణాల్లో ఎన్ని ఇళ్లు ఉంటేనేం.. పల్లెటూరిలో గింత పంట భూమి ఉంటే అదెంతో విలువ..' అన్న సామెత ఇప్పుడు అక్షరాల నిజం చేస్తోంది. ఆర్థిక స్తోమత ఉన్న వారు గ్రామాల్లో పంట భూములు కొనుగోలు వైపు దృష్టి సారించారు.

ఖమ్మంరూరల్: ఈ మధ్య కాలంలో నియోజకవర్గంలో పంటభూముల ధరలు ఆకాశాన్నంటి భూముల క్రయ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ, వ్యాపార వర్గాలతోపాటు మధ్యతరగతి, ధనిక వర్గాలు, కూలి పనులు చేసుకుని కొద్దోగొప్ప కూడబెట్టుకున్న వారు కూడా తమకు చేతనైనంత పంట భూమినే కొనుగోలు చేయడానికి ఇష్టపడుతున్నారు.

ఏం మోసం జరుగుతుందోనని..

జిల్లా కేంద్రం పరిసరాల్లో ఎకరం రూ.3 కోట్లు పైమాటే పలుకుతోంది. అక్కడ అంత ధర పెట్టలేని వారు వ్యవసాయ భూములు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. పైగా పట్టణాల్లో ప్లాట్లు కొనాలంటే ధర ఎక్కువ ఉండడంతో పాటు ఏం మోసం జరుగుతుందోనన్న ఆవేదన వెంటాడుతుంటుంది. ఇదంతా ఎందుకులే అనుకుని వ్యవసాయభూమి కొంటేనే మేలని భావిస్తున్నారు. దీంతో వెంచర్లలో ప్లాట్లను చూసే వారికంటే గ్రామాల్లో సాగు భూములు చూసే వారి సంఖ్యే పెరుగుతోంది. అయితే ప్లాట్ల కంటే పంట భూములనే ఎక్కువగా అడుగుతున్నారని మధ్యవర్తులు సైతం అంటున్నారు.

పొలం అయితే మేలని..

వ్యవసాయ భూములు కొనుగోలు చేస్తే ప్రభుత్వం ఇచ్చే 24 గంటల ఉచిత విద్యుత్‌తో పాటు పంట భూములపై బ్యాంక్‌లు రుణాలు ఇస్తాయి. అంతేకాక రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా కింద ఎకరాకు ఖరీఫ్, రబీ సీజన్లకు కలిపి రూ.12 వేలు, కేంద్ర ప్రభుత్వం అయిదెకరాల్లోపు ఉన్న వారికి పీఎం కిసాన్ సమ్మాన్ పథకం కింద ఏడాదికి రూ.6 వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. ఇక ఇది పోను ఎకరాకు రూ.10వేల నుంచి రూ.15 వేలు కౌలు కూడా అదనంగా వస్తుంది. ఇలా వ్యవసాయ భూముల వల్ల ప్రయోజనాలను గుర్తించడంతో ధరలు పెరగడంతో పాటు కొనే వారి సంఖ్య కూడా పెరుగుతోంది.

పుంజుకుంటున్న ధరలు..

నియోజకవర్గంలోని కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాల్లో పంట భూముల క్రయవిక్రయాలు చాలా వేగంగా కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న ఏదులాపురం, ముత్తగూడెం, మద్దులపల్లి, వెంకటగిరి ఏరియాల్లో 250 గజాల ప్లాటు ధర రూ.35 లక్షలు నుంచి రూ.50 లక్షల వరకు ఉంది. దీనికి బదులు పంట భూములు కొంటే ఏకంగా రెండు నుంచి మూడెకరాలు వస్తుందని చాలామంది ప్లాట్లదారులు పంట భూములపై దృష్టి సారించారు. దీంతో ఖమ్మం చుట్టూ పది కిలోమీటర్ల మేర ఎకరాకు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు వరకు పలుకుతుండగా.. గ్రామాల్లోనూ ఇప్పుడిప్పుడే ధరలు పుంజుకుంటున్నాయి. ఒకప్పుడు ఎకరం రూ. 7లక్షల నుంచి రూ.8 లక్షలు ఉన్న భూమి ఇప్పుడు రూ.20 లక్షల నుంచి రూ.22 లక్షల వరకు పెరిగింది. ఇలా పల్లెల్లో భూములు అమాంతం పెరిగిపోతుండడంతో గ్రామీణులు స్వయంగా వ్యవసాయం చేసే వారు ఇబ్బంది పడుతున్నారు.

అప్పులు పెరిగి అమ్ముతున్నా..

50 ఏళ్ల నుంచి వ్యవసాయం చేస్తున్నా. ఏఏటికాయేడు అప్పులే మిగులుతున్నాయి. అసలుకు వడ్డీలు కలిపి కుప్పలుగా అప్పు పెరుగుతోంది. కాబట్టి ప్రస్తుతానికి మంచి ధర వస్తుండడంతో రెండెకరాలు అమ్మి అప్పులు తీర్చాలనుకుంటున్నా. మిగతా డబ్బులతో వ్యాపారం పెడతా.

– వెంకటయ్య, రైతు, చేగొమ్మ

జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ



సర్క్యులర్ అందజేస్తున్న డీఐఈఓ రవిబాబు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) నాయకులు కోరారు. ఈమేరకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, శెట్టి రజినీకాంత్, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గుద్దేటి రమేష్‌బాబు శుక్రవారం డీఈఓ సామినేని సత్యనారాయణ, డీఐఈఓ రవిబాబుకు వినతిపత్రాలు అందజేశారు. దీంతో ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థల్లో నర్సరీ నుంచి ఇంటర్ వరకు జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తూ అధికారులు సర్క్యులర్లు జారీ చేశారని నాయకులు తెలిపారు.

ఉచిత పార్థివదేహ వాహనాన్ని వినియోగించుకోండి



మార్చురీ గోడపై రాసిన ఫోన్ నంబర్లు

ఖమ్మంవైద్యవిభాగం: మృతదేహాలను తరలించేందుకు ఏర్పాటు చేసిన ఉచిత పార్థివదేహ వాహన సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆర్‌ఎంఓ రాంబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనేపథ్యాన మార్చురీ గోడలపై వాహన డ్రైవర్ల ఫోన్ నంబర్లు రాసినట్లు తెలిపారు. ఎవరైనా డబ్బులు అడిగితే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న రాయల

రఘునాథపాలెం: మండలంలోని జింకలతండా రోడ్డు గిడ్డంగుల సంస్థ గోదాం ఆవరణలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా, నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం రోడ్డు పనులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.ముందస్తు ప్రణాళికలతో నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజు, గోడౌన్ మేనేజర్ కవిత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాకాసితండాలో అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న గౌతమ్

తిరుమలాయపాలెం: వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు రక్షణ చర్యలు తీసుకునేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యాన శిక్షణ కార్యక్రమాలతో పాటు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. ఈనేపథ్యాన రాకాసితండా గ్రామంలో శుక్రవారం ఎన్‌డీఆర్‌ఎఫ్ టీం కమాండర్ గౌతమ్ గ్రామస్తులకు వరదల నుంచి ఎలా కాపాడుకోవాలి, అపస్మారక స్థితిలోకి వెళ్లిన వారికి సీపీఆర్ చేసే విధానాలపై ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఎం సీత, గ్రామస్తులు దేశ్యా, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

• ఇదీ మా ఘనత..

ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు బడిబాటతో పాటు వినూత్న ప్రచారాన్ని చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు తయారు చేయించి పాఠశాలల ఎదుట, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రదర్శిస్తున్నారు. ఈనేపథ్యాన ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ భవనానికి 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీ, రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులతో ఉన్న ఫ్లెక్సీ ఏర్పాటు చేయగా.. అక్కడికి వచ్చిన వారు ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– ఖమ్మంమయూరిసెంటర్



కేఎంసీ కార్యాలయానికి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సమాచారం

➡ నేడు మదన్‌లాల్ సంస్మరణ సభ

ఖమ్మం మామిళ్లగూడెం: వైరా మాజీ ఎమ్మెల్యే బాణోత్ మదన్‌లాల్ సంస్మరణ సభను జెడ్పీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ నెల 14న శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాణోత్ భద్రు నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎల్‌హెచ్‌పీఎస్, వీరనారీమణుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యాన నిర్వహించే ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

➡ విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని మమత రోడ్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల పనుల కారణంగా శనివారం(నేడు) ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ లక్ష్మణ్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా 11 కేవీ మైసమ్మగుడి ఫీడర్, పాకబండ ఫీడర్, మధురానగర్, మమత ఫీడర్‌లకు విద్యుత్ నిలిపివేస్తున్నందున గొల్లగూడెం రోడ్, విద్యాక్షేత్ర స్కూల్ పరిసరాలు, మధురానగర్, వరదయ్యనగర్, మమత రోడ్, పులిపాటి నగర్, రాఘవయ్య నగర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం కలగనుందని తెలిపారు.

➡ రేపు సొసైటీ సమావేశం

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మ్యూచువల్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ ఖమ్మం జనరల్ బాడీ సమావేశాన్ని ఈ నెల 15న (ఆదివారం) నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఖమ్మం టీఎన్జీఓస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఈ సమావేశానికి టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు హాజరవుతారని, సభ్యులు సకాలంలో హాజరుకావాలని సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కట్ట శేఖర్, పి.విజయ్‌కుమార్ కోరారు.

వాటర్ డిస్పెన్సర్ బహూకరణ



అందించిన వాటర్ డిస్పెన్సర్‌తో టీచర్ గీత, చిన్నారులు

తిరుమలాయపాలెం: పుట్టి పెరిగిన గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి ఆస్ట్రేలియాలో ఉంటున్న కేతినేని వెంకటేశ్వర్లు కుమారుడు అన్వేష్ రూ.10వేల విలువైన వాటర్ డిస్పెన్సర్‌ను శుక్రవారం బహూకరించారు. ఈమేరకు పిల్లల దాహార్తిని తీర్చేందుకు ముందుకొచ్చిన అన్వేష్‌కు అంగన్‌వాడీ టీచర్ గీత కృతజ్ఞతలు తెలిపారు.

మెడికోలకు నివాళి

ఖమ్మం సహకారనగర్: ఈ నెల 12వ తేదీన జరిగిన విమాన ప్రమాదంలో మృత్యువాత పడిన మెడికల్ విద్యార్థులకు సంఘీభావంగా నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద డాక్టర్స్ మెడికల్ అకాడమీ ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించినట్లు అకాడమీ డైరెక్టర్లు రాయల సతీష్‌బాబు, ఈగా భరణికుమార్‌లు తెలిపారు. అకాడమీ సిబ్బంది పాల్గొన్నారు.

పంట మార్పిడితో సుస్థిర ఆదాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సరిత

నేలకొండపల్లి: పంట మార్పిడితోనే సుస్థిర ఆదాయం పొందవచ్చని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మండలంలోని మండ్రాజుపల్లి రైతు వేదికలో శుక్రవారం వైరా కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. అవసరం మేరకే ఎరువులు, రసాయనాలు వాడి తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందాలన్నారు. సేంద్రియ సాగు వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వి.చైతన్య, ఫణిశ్రీ, ఉద్యానవన శాఖ అధికారి అపర్ణ, ఏడీఏ బి.సరిత, నేలకొండపల్లి వ్యవసాయాధికారి ఎం.రాధ, రైతు ప్రతినిధులు నల్లమల్ల వెంకటేశ్వరరావు, నెల్లూరి లీలాప్రసాద్, మేకల వెంకటేశ్వర్లు, ఏఈఓలు అవినాష్, శశిరేఖ, శిరీష, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులను మోసం చేస్తున్న కేంద్రం'



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యం

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ మోసం చేస్తుందని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా(టీయూసీఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం ఆరోపించారు. శుక్రవారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నవీకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను మార్చుతూ కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తుందన్నారు. ఐఎఫ్‌టీయూ, టీయూసీఐలో విలీనమైన తర్వాత నిర్వహించే తొలి రాష్ట్ర మహాసభలను ఈ నెల 21, 22 తేదీల్లో నిజామాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆతర్వాత టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.హన్మేష్ మాట్లాడుతూ.. దేశంలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు రాబోయే కాలంలో చేపట్టాల్సిన పోరాటాలపై మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను కార్మికవర్గం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీయూసీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.రామయ్య, రాష్ట్ర నాయకులు కొత్తపల్లి రవి, ఆవుల అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, సీ.వై. పుల్లయ్య, నాయకులు ములకలపల్లి లక్ష్మీనారాయణ, కంకనాల శ్రీనివాస్, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల పర్వం..

➡ ఆర్యవైశ్య కార్యాలయానికి స్థలం కేటాయించాలి



మంత్రి తుమ్మలతో ఆర్యవైశ్య మహాసభ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా ఆర్యవైశ్య మహాసభ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి 2 వేల గజాల స్థలం కేటాయించాలని కోరుతూ మహాసభ ప్రతినిధులు శుక్రవారం ఖమ్మంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఆర్యవైశ్య మహాసభ అభ్యున్నతికి తోడ్పాటునివ్వాలని ప్రతినిధి వర్గం అభ్యర్థించింది. ఈ కార్యక్రమంలో మహాసభ ప్రతినిధులు వనమా వేణుగోపాలరావు, వనమా కిరణ్‌కుమార్, గోళ్ల రాధాకృష్ణమూర్తి, వనమా విశ్వేశ్వరరావు, నూకల శ్రీనివాసరావులతో పాటు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, నరేష్, శ్రీనివాసరావు, రమేష్, గోపాల్‌రావు, సీతయ్య, బలరాం, లక్ష్మణ్‌రావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

➡ విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలి

ఖమ్మం మామిళ్లగూడెం: పెంచిన బస్ చార్జీలను తగ్గించాలని, విద్యార్థులకు ఉచితంగా బస్సుపాస్‌లు ఇవ్వాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యాన ఆర్‌ఎం కార్యాలయంలో అధికారి రామయ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గోకినపల్లి మస్తాన్ మాట్లాడుతూ.. విద్యాలయాలు ప్రారంభమైన సందర్భంగా బస్‌పాస్ చార్జీలు పెంచి విద్యార్థులపై అదనపు భారం మోపడం సరికాదన్నారు. విద్యార్థులకు ఉచిత బస్ కల్పించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మణికంఠ, అభి, మహేష్, నితిన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

● ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపల్ ఉద్యోగులకు, సిబ్బందికి మున్సిపల్ వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం పెదతండాలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పీఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి వివిధ రకాల వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించినట్లు మున్సిపల్ కమీషనర్ ఆళ్ల. శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, ఆస్పత్రి మేనేజ్‌మెంట్ భీమిరెడ్డి బాబురెడ్డి, మేనేజర్ ఎస్.మణి, ఆర్‌ఐ శ్రీధర్‌రెడ్డి, కిరణ్, శ్రీనివాస్, హసన్ తదితరులు పాల్గొన్నారు.

● తిరుమలాయపాలెం: మండలంలోని జల్లెపల్లి, తెట్టెలపాడు గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలతో పాటు ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తిరుమలాయపాలెం పీహెచ్‌సీ వైద్యుడు అవినాష్ అన్నారు. శుక్రవారం ఈమేరకు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గతేడాది ఎక్కువ డెంగీ జ్వరాలు వచ్చిన గ్రామాలను గుర్తించి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓలు రామయ్య, దూప్‌సింగ్ హెచ్‌ఎస్ వినయ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పి మానస, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సన్మానాలు..

➡ 25వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడికి..

ఖమ్మం వన్‌టౌన్: ఖమ్మం 25వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన దాసరి పూర్ణను ఆ డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జ్ కల్వకుంట్ల గోపాల్ ఆధ్వర్యాన శనివారం కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు పూర్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రముఖులు ఓం నమఃశివాయ, తుమ్మూరు రామిరెడ్డి, గౌర్ల రాంరెడ్డి, నాగిశెట్టి రాధాకృష్ణ, అనిశెట్టి గిరి, బండారు శ్రీనివాసరావు, మార్కపుడి నాగభూషణం, గార్ల వెంకన్న, పంది నరేష్, బొడ్డు మధు, గట్టి కొండ గురుమూర్తి, ఎస్‌కె.ఖాజా, ఎండీ జానీ పాల్గొన్నారు.

➡ 'ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్' విద్యార్థులకు పతకాలు




విద్యార్థులను సత్కరిస్తున్న అధ్యాపకులు

ఖమ్మంసహకారనగర్: తమ కళాశాల పీజీ విద్యార్థులు 12 మంది బంగారు పతకాలు సాధించినట్లు కేయూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులను సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 23న నిర్వహించనున్న కేయూ స్నాతకోత్సవంలో పతకాలు అందించనున్నారన్నారు. 2016 ఎంఏ ఎకనామిక్స్‌లో కె.కొండల్‌రావు-3, 2017 ఎం.ఏ తెలుగు విభాగంలో వై.శ్రీనివాసరావు-1, 2018 ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో నిమ్మల హారతి-3, ఎమ్మెస్సీ జువాలజీ విభాగంలో దోసపాటి లక్ష్మీపావని-1, 2019 ఎమ్మెస్సీ కెమిస్ట్రీ విభాగంలో శెట్టి సంధ్య-3 పతకాలు, 2020లో ఎమ్మెస్సీ జువాలజీలో నాగటి సుప్రియ-1 బంగారు పతకాలు సాధించారని తెలిపారు.


సామూహిక అక్షరాభ్యాసం..

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు శుక్రవారం ఆయా పాఠశాలల బాధ్యులు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, పలక, బలపాలను అందించారు. జ్ఞాపకార్థంగా పలువురు దాతలు విద్యా సామగ్రి అందించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ అక్షరాభ్యాసాలు చేశాక మొక్కలు నాటారు.


– సాక్షినెట్‌వర్క్



ఖమ్మం మామిళ్లగూడెం: ఖాజీపుర ప్రభుత్వ పాఠశాలలో యూనిఫాం అందజేస్తున్న మేయర్ నీరజ



రఘునాథపాలెం మండలం గణేశ్వరం పాఠశాలలో..



నేలకొండపల్లి: చెరువుమాధారం అంగన్‌వాడీ కేంద్రంలో మొక్క నాటుతున్న దృశ్యం